హరహర మహాదేవ

- శివనామస్మరణతో మార్మోగిన ఆలయాలు
- భక్తులతో కిటకిటలాడిన శైవక్షేత్రాలు
- ప్రత్యేక పూజలు, ఉపవాస దీక్షలు
- ఘనంగా మహాశివరాత్రి వేడుకలు

లోకేశ్వరం: హరహర మహాదేవ.. శంభో శంకర..అంటూ భక్తుల శివనామస్మరణతో ఆలయాలన్నీ మార్మోగాయి. తరలివచ్చిన భక్తజనంతో జిల్లావ్యాప్తంగా శైవక్షేత్రాలు కిటకిటలాడాయి. లోకేశ్వరం మండల కేంద్రంలోని శివాలయంతోపాటు భాగాపూర్‌లోని లక్ష్మీనారాయణ స్వామి ఆలయం, గోదావరి నది ఒడ్డున బ్రహ్మేశ్వర ఆలయంలో శనివారం మహాశివరాత్రి పర్వదినాన్ని ఘనంగా నిర్వహించారు. బ్రహ్మేశ్వరాలయం గోదావరి నదిలో భక్తులు స్నానాలు ఆచరించి శివలింగానికి పూజలు చేసి మొక్కు చెల్లించుకున్నారు. ముథోల్ సీఐ వినోద్‌రెడ్డి పూజలు చేపట్టారు. ఆయన ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. కాగా, స్నానఘట్టాల వద్ద మట్టి చేరడంతో భక్తులు ఇబ్బందులు పడ్డారు. అధికారులు ఎలాంటి ఏర్పాట్లు చేయకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. కన్కపూర్ వీడీసీ, యూత్ ఆధ్వర్యంలో భక్తుల కోసం ఏర్పాట్లు చేశారు. పంచగుడి సమీపంలోని గోదావరినది ఒడ్డున నందిపేట్ మండలం ఉమ్మెడలోని ఉమమహేశ్వర్ ఆలయంలో మొక్కులు చెల్లించుకున్నారు. మండలకేంద్రంలోని శివాలయంలో శివపార్వతుల కల్యాణాన్ని వేద పండితుడు సంతోష్ జ్యోషి ఆధ్వర్యంలో నిర్వహించారు.

భైంసాలో..

భైంసాటౌన్: పట్టణంలోని శివాలయాల్లో భక్తులు దర్శనానికి బారులు తీరి కనిపించారు. బ్రాహ్మణగల్లిలోని నగరేశ్వరాలయం, సిద్ధార్థనగర్‌లోని ఓంకారేశ్వరాలయం, కిసాన్‌గల్లి మహదేవ్‌మందిరం, భట్టిగల్లిలోని పురాతన శివాలయంతోపాటు పలు కాలనీల్లో శివాలయాల్లో భక్తులు పూజలు చేశారు.

నిర్మల్‌లో..

నిర్మల్‌టౌన్: గండిరామన్న గుట్ట రామలింగేశ్వరస్వామి ఆలయంలో భక్తులు పూజలు చేశారు. ఆలయ ట్రస్ట్ చైర్మన్ జగన్మోహన్‌రెడ్డి ఉన్నారు.

కుభీర్‌లో..

కుభీర్: కుభీర్‌లో రెండు శివాలయాలు, పాంగర్‌పహాడ్ వద్ద జటాశంఖర్, పార్డి(బి)లోని రాజరాజేశ్వర్ మందిర్, బ్రహ్మేశ్వర్ మందిర్, కుభీర్ కొండపై గల మల్లేశ్వర్ ఆలయాల్లో భక్తులు పూజలు చేశారు. పక్క మండలాల్లో ఉన్న కదిలి పాపేశ్వరాలయం, కుంటాలతోపాటు, మహారాష్ట్రలోని ససర్‌కుండ్ జలపాతానికి భక్తులు వెళ్లారు.

లక్ష్మణచాందలో..

లక్ష్మణచాంద: బాబాపూర్‌లోని శ్రీ రాజరాజేశ్వరస్వామిని దర్శించుకునేందుకు భక్తులు బారులుతీరారు. ఆలయంలో పూజలు నిర్వహించి మొక్కు చెల్లించుకున్నారు. ముందుగా వాగులో పుణ్యస్నానాలు ఆచరించి ఉపవాస దీక్షలు స్వీకరించారు. వారి కోసం సర్పంచ్ శ్రీవిద్య, ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. కోరిన కోర్కెలు తీరడంతో భక్తులు స్వామివారికి కోడెను కానుకగా సమర్పించారు. కొందరు భక్తులు తమ పిల్లలను బెల్లంతో తులాభారం వేశారు. ఆలయం వద్ద ఎస్సై రాహుల్ గైక్వాడ్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

కుంటాలలో..

కుంటాల: మండలంలోని ఓలా శివాలయం, సూర్యపూర్ రాజరాజేశ్వరాలయం, కుంటాల ఉమామహేశ్వరాలయం, మహాదేవుని ఆలయాల్లో భక్తులు పూజలు చేశారు. ఉపవాస దీక్షలు చేపట్టి ఆదివారం విరమించనున్నారు. కుంటాల ఉమామహేశ్వర, ఓలా శివాలయల్లో శివ పార్వతల కల్యాణం కనుల పండువగా నిర్వహించారు.

సారంగపూర్‌లో..

సారంగపూర్: మండలంలోని ఆలయాలు భక్తుల శివనామస్మరణతో మార్మోగాయి. పెద్ద సంఖ్యలో తరలివచ్చి దర్శించుకున్నారు.యాకర్‌పెల్లిలో నిర్వాహకులు వారికి అల్పాహారం, పండ్లు పంపిణీ చేశారు.

ముథోల్‌లో..

ముథోల్: మండల వ్యాప్తంగా శివాలయాలన్నీ భక్తులతో సందడిగా మారాయి. స్థానిక కొత్త బస్టాండ్ సమీపంలో గత పదేళ్ల క్రితం తవ్వకాల్లో బయటపడ్డ పురాతన శ్రీ పశుపతినాథ్ శివలింగాన్ని భక్తులు దర్శించుకున్నారు. స్థానిక జటశంకర గుట్టపై ఉన్న శివ లింగానికి పూజలు చేశారు. ముథోల్‌లోని ఆశ్రమ పాఠశాల ఎస్ఎస్‌సీ విద్యార్థులు భక్తులకు సేవలందించారు.

భైంసా మండలంలో..

భైంసారూరల్: మండలంలోని సిరాల గుట్టపై వెలిసిన జోడు శివలింగాలను దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. భైంసా, తానూరు, ముథోల్, కుభీర్, లోకేశ్వరం మండలాలతోపాటు మహారాష్ట్ర నుంచి వేలాది సంఖ్యలో తరలివచ్చారు. ఆలయంలో ఏర్పాటు చేసిన బారికేడ్ల వద్ద నిరీక్షించి దర్శనం చేసుకున్నారు. చుచుంద్ గ్రామంలోని పురాతన సిద్ధేశ్వర ఆలయం, దేగాం, ఇలేగాం, మహాగాం, సుంక్లి, కామోల్, చింతల్‌బోరి, వాలేగాం, హంపోలి గ్రామాల్లోని మహాదేవుని ఆలయాల్లో పూజలు చేశారు.

తానూరులో..

తానూరు: బోరిగాం గుట్ట ప్రాంతంలో ఉన్న మహాదేవ్ ఆలయం, భోసి లోని కాశీవిశ్వనాథ్, బోల్సా, ఎల్వి, తొండాలలోని శివాలయాల్లో భక్తులు పూజలు చేశారు. ఉపవాస దీక్షలతో వచ్చి మొక్కు చెల్లించుకున్నారు. కాశీవిశ్వనాథ్ ఆలయంలో జాతర ఉత్సవాలకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ఆదివారం ఉపవాసదీక్షలు ముగింపు కావడంతో భక్తుల కోసం భైంసాకు చెందిన వ్యాపారవేత్త శితారాం షేట్ కుటుంబ సభ్యులు అన్నదానం నిర్వహించనున్నారు.

ఖానాపూర్‌లో..

ఖానాపూర్: శివరాత్రి సందర్భంగా ఆలయాలకు భక్తులు పోటెత్తారు. పిల్లాపాపలతో బారులు తీరి దర్శనం చేసుకున్నారు. రంగపేట్, దిలావర్‌పూర్, పాత ఎల్లాపూర్, తదితర చోట్ల ఆలయాల్లో మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ పూజలు చేశారు. ఆలయ కమిటీల ఆధ్వర్యంలో రాథోడ్ రమేశ్‌ను సన్మానించారు.

దిలావర్‌పూర్‌లో..

దిలావర్‌పూర్: కదిలిపాపహరేశ్వరాలయంలో భక్తులు పూజలు చేశారు. ఏఐసీసీ కార్యక్రమాల అమలు కమిటీ చైర్మన్ ఏలేటి మహేశ్వర్‌రెడ్డి దర్శించుకుని పూజలు చేశారు. భక్తుల కోసం ఆలయకమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. జాతర సందర్భంగా మిఠాయి, ఆట వస్తువుల దుకాణాలు వెలిశాయి.

దస్తురాబాద్‌లో..

దస్తురాబాద్: బుట్టపూర్, రేవోజీపేట, గోడిసిర్యాల, మున్యాల, భూత్కూర్, రాంపూర్, దస్తురాబాద్ గ్రామాల్లో మహాశివరాత్రిని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. భక్తులు గోదావరిలో పుణ్యస్నానాలు చేసి గంగమ్మ ఆలయాల్లో పూజలు చేశారు. మండల కేంద్రంలోని శివాలయంలో శివపార్వతుల కల్యాణం కనులపండువగా జరిగింది. గోడిసిర్యాల రాజన్న ఆలయంలో రాత్రి శివపార్వతుల కల్యాణం, అర్ధరాత్రి ఆలయంలో నాగుపాము దర్శనం కోసం వేచి ఉండి జాగరణ నిర్వహిస్తారు. మరోవైపు ఆలయంలో విశ్రాంత ఐఏఎస్ శర్మనాయక్ భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఎస్సై ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.


తానూరు: భోసిలోని కాశీవిశ్వనాథ్ ఆలయంలో


ఖానాపూర్: దిలావర్‌పూర్‌లో కల్యాణం


లక్ష్మణచాందా: పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు


భైంసాటౌన్: ఓంకారేశ్వరాలయం వద్ద క్యూలో భక్తులు


లోకేశ్వరం: శివ పార్వతుల కల్యాణం


నిర్మల్‌టౌన్: లింగానికి అభిషేకం చేస్తున్న భక్తులు


కుంటాల: సూర్యపూర్ రాజరాజేశ్వరాలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు


ఖానాపూర్: పూజలో పాల్గొన్న మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్


భైంసారూరల్: సిరాలలో భక్తుల పూజలు


దస్తురాబాద్: పూజలు చేస్తున్న మహిళలు


యాకర్‌పెల్లి బసవేశ్వర ఆలయంలో..


కుభీర్‌లోని శివసాయి ఆలయంలో..


లోకేశ్వరం: పూజలు నిర్వహిస్తున్న భక్తులు


అన్నదానం చేస్తున్న విశ్రాంత ఐఏఎస్ అధికారి


కుంటాల: ఓలా శివాలయంలో..


లోకేశ్వరం: దర్శనం కోసం క్యూలో భక్తులు


లక్ష్మణచాంద: ఆలయంలో పోటెత్తిన భక్తులు


ముథోల్: శివలింగానికి పూజలు చేస్తూ..


సిరాలాలో బారులు తీరిన భక్తులు

క్లుప్తంగా

రోడ్డు పనులు ప్రారంభం


ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు రాజేశ్వర్‌రెడ్డి

సారంగపూర్: మండలంలోని జామ్ గ్రామంలో రైతులు తమ పంట పొలాలకు వెళ్లే రహదారి బాగోలేక ఇబ్బంది పడుతున్నామని విషయాన్ని జెడ్పీటీసీ సభ్యుడు పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డికి ఇటీవల విన్నవించారు. స్పందించిన ఆయన వెంటనే జెడ్పీనిధులు రూ.2లక్షల 50 వేలతో మట్టిరోడ్డు నిర్మాణాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. జెడ్పీటీసీ సభ్యుడు రాజేశ్వర్‌రెడ్డికి ఈ సందర్భంగా గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక ఎంపీటీసీ సభ్యురాలు మహిపాల్ వనజ, ఉప సర్పంచ్ విలాస్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు రాజలింగం, నాయకులు చంద్రశేఖర్, వీడీసీ సభ్యులు ఉన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి


టాస్ వేసి క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న పవార్ రామారావు పటేల్

కుంటాల: యువత క్రీడల్లో రాణించాలని బీజేపీ నాయకుడు పవార్ రామారావు పటేల్ పేర్కొన్నారు. మండలంలోని కల్లూర్‌లో కేసీసీ (కల్లూర్ క్రికెట్) క్లబ్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన జోనల్ లెవల్ క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఈ టోర్నీలో మొత్తం 45 జట్లు పాల్గొంటాయని, మార్చి 15 వరకు పోటీలు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు. ప్రథమ బహుమతి రూ.33,333, ద్వితీయ బహుమతి రూ.15,555 నగదుతోపాటు షీల్డ్‌లు అందజేస్తామని పేర్కొన్నారు. ఎంపీపీ గజ్జారాం యాదవ్, డీసీసీబీ డైరెక్టర్ తుర్పాటి వెంకటేశ్, పిప్పెర వెంగల్‌రావు, నాయకులు బద్దం భోజారెడ్డి, పసుల నవీన్, లక్ష్మణ్ పటేల్, పెంటవార్ దశరత్, దత్తు, ఏపీవో గట్టుపల్లి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

కురుమ సంఘం కార్యవర్గం ఎన్నిక


ప్యాదరి భూమన్న

కుంటాల: కుంటాల కురుమ సంఘం నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ప్యాదరి భూమన్న, ఉపాధ్యక్షుడిగా మ్యాతారి పోతన్న, కోశాధికారిగా పెద్ద సాయన్న, సలహా సభ్యులుగా రమేశ్, శ్రీకాంత్, భోజరాం, గజ్జారాం, మహేందర్, గజేందర్ తదితరులు ఎన్నికయ్యారు. కురుమ సంఘం అభివృద్ధికి కృషి చేస్తామని నూతన కార్యవర్గ సభ్యులు పేర్కొన్నారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం


ప్రారంభిస్తున్న సర్పంచ్ నర్సయ్య

లోకేశ్వరం: యువత అన్నిరంగాల్లో రాణించాలని సర్పంచ్ సంగెం నర్సయ్య అన్నారు. మండలంలోని పుస్పూర్ గ్రామంలో శనివారం క్రికెట్ టోర్నీని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ టోర్నీలో ఆరు జట్లు పాల్గొంటున్నాయని, ఇందులో గెలుపొందిన ప్రథమ బహుమతికి రూ.8 వేలు, ద్వితీయ బహుమతికి రూ.5 వేల నగదు అందిస్తారని అన్నారు. నాయకులు బండి ప్రశాంత్, సాయారెడ్డి, భోజారెడ్డి, భోజన్న, నర్సయ్య ఉన్నారు.

మున్సిపల్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు


వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజేందర్

ఖానాపూర్: పట్టణంలోని గోదావరినది వద్ద పుణ్యస్నానం ఆచరించేందుకు గ్రామాల నుంచి వచ్చే భక్తుల కోసం మున్సిపల్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. వాటిని మున్సిపల్ చైర్మన్ రాజేందర్ శనివారం పరిశీలించారు. చిన్నపిల్లల కోసం జల్లు స్నానంతోపాటు మహిళలు దుస్తులు మార్చుకునేందుకు తాత్కాలిక గదులు ఏర్పాటు చేశారు. భక్తులకు తాగునీటి వసతితోపాటు వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. నాయకులు సురేశ్, శంకర్, రాజశేఖర్ ఉన్నారు.

వాటర్ ప్యాకెట్ల పంపిణీ

లక్ష్మణచాంద: మండలంలోని బాబాపూర్ రాజరాజేశ్వరస్వామి జాతరకు వచ్చిన భక్తులకు ఆమ్‌ఆద్మీ జిల్లా కన్వీనర్ సయ్యద్ హైదర్ ఆధ్వర్యంలో వాటర్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. వీటిని ఎస్సై రాహుల్ గైక్వాడ్ అందజేశారు. జిల్లా కన్వీనర్ హైదర్, సభ్యులు సాజిద్, సోఫి, వాహిద్, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గంగాహారతి


గోదావరిలో పూజలు చేస్తున్న సంఘసభ్యులు

ఖానాపూర్: పట్టణంలోని గోదావరి నదిలో స్థానిక గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో గంగాహారతి కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు పరిమి సురేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ అంకం రాజేందర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా శివలింగానికి అభిషేకం, పూజలు నిర్వహించి, గోదావరిలో గంగాదేవికి హారతి ఇచ్చారు. మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ చిన్నం సత్యం, కమిషనర్ రత్నాకర్‌రావు, గంగపుత్ర సంఘం నాయకులు తదితరులు ఉన్నారు.


హారతి ఇస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజేందర్

బహిరంగసభను జయప్రదం చేయాలి

ఖానాపూర్: జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని వర్షకొండ గ్రామంలో ఆదివారం చక్రవర్తి ఛత్రపతి సాహుమహరాజ్ విగ్రహావిష్కరణతోపాటు భారీ బహిరంగసభను జయప్రదం చేయాలని బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జి బన్సీలాల్ రాథోడ్ కోరారు. పట్టణంలోని బీఎస్పీ కార్యాలయంలో శనివారం చలో వర్షకొండ పోస్టర్‌ను ఆవిష్కరించారు. బహిరంగసభకు బహుజనులతోపాటు మేధావులు హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో అసెంబ్లీ అధ్యక్షుడు కుక్కరికారి రాజేష్, అసెంబ్లీ మహిళ కన్వీనర్ హారతి తదితరులు ఉన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

కూటి కోసం బాలుడు..

లక్ష్మణచాంద: మండలంలోని బాబాపూర్ శ్రీ రాజరాజేశ్వర స్వామి జాతరలో ఆలయం వద్ద ఓ బాలుడు గాంధీ వేషధారణలో కూర్చొన్నాడు. కూటి కోసం శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉండడంతో భక్తులు తమకు తోచిన సాయం చేశారు.



శివాలయంలో పూజలు


విలాస్ శర్మను సన్మానిస్తున్న పూజార్లు

లోకేశ్వరం: మహాశివరాత్రిని పురస్కరించుకుని మండల కేంద్రంలోని శివాలయంలో దూపదీప నైవేద్యం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పసకంటి విలాస్‌శర్మ శనివారం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన్ను ఆలయ పూజార్లు, సర్పంచ్ దార్వాడి సౌజన్య, వీడీసీ సభ్యులు సన్మానించారు. భక్తులు తదితరులు ఉన్నారు.

బసవేశ్వరుడి బాటలో పయనించాలి

ఆదిలాబాద్‌రూరల్: మహాత్మా బసవేశ్వరుడు చూపిన బాటలో పయనించాలని తెలంగాణ రాష్ట్ర వీరశైవ లింగాయత్ లింగ బలిజ సమన్వయ సమితి అధ్యక్షుడు ముస్తాపురే అశోక్ పిలుపునిచ్చారు. మహా శివరాత్రిని పురస్కరించుకొని శనివారం జిల్లా కేంద్రంలోని బసవేశ్వర చౌక్‌లో ఆయన విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. కులరహిత సమాజ నిర్మాణం కోసం కృషి చేసిన మహనీయుడని కొనియాడారు. మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ రంగినేని మనీషా, పవన్‌రావ్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిక్కాల దత్తు, కలాల శ్రీనివాస్, జగదీశ్వర్, వెండి బద్రీశ్వర్ పాల్గొన్నారు.

నేడు మల్లన్న బోనాలు

ఖానాపూర్: మండలంలోని తర్లపాడ్ గ్రామంలో ఇటీవల వెలిసిన అగ్గి మల్లికార్జున స్వామి ఆలయ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మల్లన్న బోనాల కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. బోనాలతోపాటు అన్నదానం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

నేడు శివాజీ జయంతి శోభాయాత్ర

ఖానాపూర్: వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించ తలపెట్టిన శివాజీ జయంతి శోభాయాత్ర ర్యాలీని జయప్రదం చేయాలని వీహెచ్‌పీ జిల్లా నాయకుడు కాసవేణి ప్రణయ్ ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక ఐబీ నుంచి బజరంగ్‌దళ్ ధ్వజాన్ని ప్రారంభించి, అక్కడి నుంచి శివాజీ విగ్రహం వరకు ర్యాలీ ఉంటుందని పేర్కొన్నారు. హిందూ బంధువులు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

సారంగపూర్: మండలంలోని రాంసింగ్‌తండాలో చౌహాన్ ఈనేశ్‌కు చెందిన ఇల్లు అగ్నిప్రమాదంలో దగ్ధమైంది. బాధిత కుటుంబానికి జెడ్పీటీసీ సభ్యుడు పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి శనివారం రూ.5 వేలు ఆర్థికసాయం అందజేశారు. షార్ట్ సర్క్యూట్‌తో మంటలు అంటుకోలేదని, కేవలం వారి ఇంట్లో దీపం ముట్టించడం వల్ల ప్రమాదం జరిగిందని ట్రాన్స్‌కో ఏఈ సాయికిరణ్ తెలిపారు. ఇంటికి నిప్పంటుకోవడం వల్ల ఇంటిపై ఉన్న విద్యుత్ తీగ తెగిపడిందని పేర్కొన్నారు. అడెల్లి ఆలయ మాజీ అధ్యక్షుడు ఉట్ల రాజేశ్వర్, బీఆర్ఎస్ నాయకులు నారాయణ, రాజలింగం, గవాస్కర్ ఉన్నారు.

కొనసాగుతున్న హరినామ సప్తాహం

ముథోల్: స్థానిక శ్రీ పశుపతినాథ్ ఆలయ ప్రాంగణంలో గ్రామకమిటీ ఆధ్వర్యంలో అఖండ హరినామసప్తాహం కొనసాగుతోంది. శనివారం ఉదయం భజన దీండులతో కీర్తనాలు, గీతాపారాయణం, రాత్రిసమయంలో భజన తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. భజన దీండు భక్తులకు ఉదయం, సాయంత్రం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.